సేవలతో నవశకానికి నాంది

- ప్రతి ఇంటా కుటుంబ సభ్యులుగా మారిన వలంటీర్లు
- సేవలు అద్భుతమంటూ సర్వత్రా ప్రశంసలు
- మంచి వ్యవస్థను ఏర్పాటుచేసిన సీఎం జగన్
- ప్రతిపక్షాల విమర్శలపై ఆగ్రహం




కరోనా సమయంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వలంటీర్ రమణ (ఫైల్): ఉల్లిపాలెంలో అగ్ని బాధితుడు అష్మాద్‌కు స్వచ్ఛందంగా నగదు అందిస్తున్న వలంటీర్లు (ఫైల్)

కోడూరు: ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఎటువంటి సిఫార్సు లేకుండా నేరుగా అర్హుల ముంగిటకే అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి, ఆయా కుటుంబాలకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే వలంటీర్లు తలుపు తట్టి లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్నారు. బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారి నుంచి అవసరమైన పత్రాలు సేకరించి సచివాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయించి మంజూరు చేయిస్తున్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో సైతం వలంటీర్లు ప్రతి ఇంటా తిరిగి ఫీవర్ సర్వే నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వాటిని ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు కూడా తెలియజేశారు. అవసరమైన మందులను అందజేశారు. ప్రతి ఇంటా వలంటీర్‌ను ప్రజలు తమ కుటుంబ సభ్యుడిగా అక్కున చేర్చుకున్నారు. సేవల్లో వలంటీర్లు నవశకానికి నాంది పలికారు. అలాంటి వారిని నీచ రాజకీయాల్లోకి లాగడం, ప్రజా సేవకులపై పవన్ కల్యాణ్ నోరు పారేసుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఈ చిత్రంలో మంచంపై పడుకున్న అవ్వ పేరు అరజా మహంకాళమ్మ. వయస్సు 60 సంవత్సరాలు. కోడూరు మండలంలోని ఉల్లిపాలెం గ్రామం. ఒక కుమార్తె ఉండగా వివాహమై విజయవాడకు వెళ్లిపోయింది. మూడేళ్ల కిందట పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమైంది. భర్త రామచంద్రరావు వయస్సు 65 సంవత్సరాలు కావడంతో వృద్ధాప్యంతో బాధపడుతున్నాడు. మహంకాళమ్మకు పక్షవాతం రావడంతో ప్రభుత్వం దివ్యాంగ పెన్షన్, రామచంద్రరావుకు వృద్ధాప్య పెన్షన్‌ను అందిస్తోంది. భార్యాభర్తలు మంచానికి పరిమితం కావడంతో వీరికి వలంటీర్ కమ్మిలి వెంకటరమణ అన్నీ తానై సేవలందిస్తున్నాడు. ప్రతి నెలా ఒకటో తేదీన వెంకటరమణ వీరికి పెన్షన్‌ను అందించి, వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నాడు. మంచం మీద నుంచి లేవలేని అనేక మంది వృద్ధులను, దివ్యాంగులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేవుడిలా వలంటీర్‌ను పంపించాడంటూ మహంకాళమ్మ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు పామర్తి కృష్ణమూర్తి. వయస్సు 71 సంవత్సరాలు. కోడూరు మండలం ఉల్లిపాలెం శివారు హరిపురం గ్రామం. వీరికి ముగ్గురు పిల్లలు. ఒకరు మృతిచెందగా, ఇద్దరు పిల్లలు వేరేగా ఉంటున్నారు. కృష్ణమూర్తి, ఆమె భార్య స్వామ్రాజ్యం ఇద్దరూ వృద్ధాప్యంతో బాధపడుతున్నారు. కృష్ణమూర్తికి కుడికాలు లేకపోవడంతో వీల్‌చైర్‌లో నుంచి లేచే పరిస్థితి లేదు. భార్యాభర్తలిద్దరూ ఇంటికే పరిమితమయ్యారు. గత ప్రభుత్వంలో వీరికి కనీసం పెన్షన్ కూడా రాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృష్ణమూర్తి, స్వామ్రాజ్యం ఇద్దరికీ పెన్షన్లు మంజూరు చేసింది. కృష్ణమూర్తికి వలంటీర్ సౌమిత్ వీరి ఇంటికి వెళ్లి కావాల్సిన పత్రాలను పూర్తి చేసి, పెన్షన్‌ను మంజూరు చేయించాడు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం ఐదు గంటలకు వీరికి సౌమిత్ పింఛన్ అందిస్తున్నాడు. వలంటీర్ సౌమిత్ తమ సొంత కుటుంబ సభ్యుడితో సమానమని వృద్ధాప్య దంపతులు చెబుతున్నారు. వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.

క్లుప్తంగా

శాకంబరిదేవిగా బాల పార్వతి అమ్మవారు

టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లిలోని బాల పార్వతీ సమేత రామేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతి అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం అమ్మవారి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అద్దంకి నాంచారమ్మకు పూజలు



కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. నాంచారమ్మ అమ్మవారి మూలమూర్తికి దేవదాయ శాఖాధికారులు తొలి పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా కూరగాయాల మాలలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల భక్తులు అమ్మవారిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు పండితులు జై పార్థసారథి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కాశీవిశ్వేశ్వరుని ఆలయానికి విరాళం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి అమెరికాలో నివసిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కట్టా అనూష, నిరోషా (విజయవాడ) సోదరీమణులు రూ.5,116 విరాళం అందించారు. వారి తండ్రి కట్టా నాగోజీరావు జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని ఆదివారం చెక్కు రూపంలో మేనమామ, వైఎస్సార్ సీపీ నాయకుడు చెన్ను రంగారావు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావుకు అందజేశారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



నాగాయితిప్ప(మోపిదేవి): నాగాయితిప్పకు చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు గరికిపాటి నాగయ్య (85) మృతిచెందారు. నాగయ్య మృతదేహాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు (బుల్లి), పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



పెదప్రోలు(మోపిదేవి): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పెదప్రోలు వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదప్రోలుకు చెందిన సుబ్బారావు, మురళీకృష్ణ బైక్‌పై బయలుదేరారు. జాతీయ రహదారి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావు, మురళీకృష్ణతో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ



గుడివాడ టౌన్: గుడివాడలో ఆదివారం క్రైస్తవ సంఘాల పాస్టర్లు శాంతి ర్యాలీ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏలూరు రోడ్‌లోని మౌంట్ కర్మెల్ ఆర్‌సీఎం చర్చి నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యదేశంలో ఒక వర్గానికి చెందిన వారిపై దాడులు నిర్వహించడం దారుణమన్నారు. కార్యక్రమంలో బిషప్ అప్పికట్ల జాషువా, ఆర్‌సీఎం ఫాదర్ మైఖేల్, వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు మందా సువర్ణబాబు, విక్టర్ పాల్, బి శ్యాంబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ప్రజా సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. చినయాదర గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కిట్టు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్‌లు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే వారి వివరాలు తెలియజేయాలన్నారు. మాజీ సర్పంచ్ కంచర్లపల్లి విజయసారధి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 5 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఉదయం 10 గంటలకు సహస్ర లింగార్చన నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరించి శివసాధంలో అశేష భక్తుల మధ్య స్వామివారికి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా చేశారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన జగన్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వి.కొత్తపాలెంలో జగనన్న కాలనీకి నూతన విద్యుత్ లైన్ ప్రారంభం


విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నేరవేర్చి ప్రతి ఒకరి హృదయాల్లో చేరగని ముద్ర వేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. వి.కొత్తపాలెం జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను రమేష్‌బాబు ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లస్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం తోడ్పాటునిచ్చిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న కాలనీల నిర్మాణాలు జరుగుతున్నాయని, కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కూడా ప్రభుత్వమే సమకూర్చుతుందని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా 90 రోజుల్లోనే ఇళ్లస్థలాన్ని లబ్ధిదారుడికి మంజూరు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగనన్న కాలనీల నిర్మాణాలు పండుగ వాతావరణంలో సాగుతున్నాయని, వీటిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇవ్వకపోగా ప్రభుత్వ అనుమతితో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి కూడా నగదు ఇవ్వకుండా పెట్టిన ఇబ్బందులను గుర్తు చేశారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై కూడా ప్రతిపక్షాలు నోరు పారేసుకోవడం పరిపాటిగా మారిపోయిందని, వీటిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అనంతరం విద్యుత్‌లైన్‌కు సంబంధించిన స్విచ్‌ను ఆన్ చేసి లబ్ధిదారులకు మీటర్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు బోనాల సమర్పణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో తిరుపతమ్మ తల్లికి శాలివాహన మహిళలు సంప్రదాయం ప్రకారం ఆదివారం బోనాలు సమర్పించారు. గ్రామంలోని తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కుమ్మర కాలనీకి చెందిన కానూర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు బోనాలు తలపై పెట్టుకుని, శ్రీలక్ష్మీ అమ్మవారి ప్రతిమతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుపతమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఏటా కుమ్మర కాలనీవాసులు అమ్మవారికి ఆషాఢంలో బోనాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుందని శ్రీనివాసరావు తెలిపారు. కానూర్ల కుటుంబీకులు, బంధువులు పాల్గొన్నారు.

మొక్కలను కన్నబిడ్డల్లా సంరక్షించాలి

జేసీ అపరాజితసింగ్


మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ సొంత బిడ్డల్లాగా మొక్కలను కూడా సంరక్షించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ అన్నారు. సహాయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామి (చిన్నాపురం డాక్టర్) 30 వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని జైహింద్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి జేసీ అపరాజితసింగ్ మాట్లాడుతూ మచిలీపట్టణానికి ఉన్న బృందావనపురం పేరును సార్థకం చేసేలా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ లేక సిలిండర్లతో కాలం గడిపిన రోజులు మర్చిపోకూడదని చెప్పారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామి రూ. 15 లక్షలు ఖరీదు చేసే 30 వేల మొక్కలను అందించడం ఆదర్శప్రాయమన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ వి. వెంకట ఫణిరామకుమార్ మాట్లాడుతూ మొక్కలు నాటడం అలవాటుగా మారాలని చెప్పారు. జిల్లా రవాణాధికారి పి. సీతాపతిరావు మాట్లాడుతూ మచిలీపట్టణాన్ని మరో మినీ బెంగళూరుగా మార్చేందుకు మొక్కల పంపిణీ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా, కార్పొరేటర్ మీర్‌అస్గర్‌అలీ, న్యాయవాది బాలాజీ, జైహింద్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, సహాయ ఫౌండేషన్ సభ్యులు శ్రీరాం, కాగిత శంకర సాంబశివరావు, కోన వెంకటేశ్వరమ్మ, నూర్జహాన్, ఖైరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలి

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న మోపిదేవి వెంకటేశ్వరరావు

చల్లపల్లి: లయన్స్ క్లబ్ సేవా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 210 దేశాల్లో లక్షా 40 వేల మంది సభ్యులతో విస్తృత సేవలు అందిస్తోందని లయన్స్ క్లబ్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లింగం శివశంకర్ అన్నారు. ఆదివారం స్థానిక క్లబ్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షునిగా మోపిదేవి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా రాయపాటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథి శివశంకర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను వివరించారు. చల్లపల్లి శాఖ సేవలను ప్రశంసించారు. నూతన కార్యవర్గం క్లబ్ ఖ్యాతి ఇనుమడించేలా సేవలు అందించాలని కోరారు. సమాజంలో ఆర్థిక అభివృద్ధి సాధించిన ప్రతి ఒక్కరూ సమాజానికి సేవ చేయాలని కోరారు. మేము సేవ చేస్తాం నినాదంతో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రపంచ దేశాల్లో అనేక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ తొలి సేవా కార్యక్రమంగా చల్లపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ద్వితీయ స్థానం సాధించిన ఏడుగురు విద్యార్థులకు నోట్ బుక్స్, గ్రామర్ బుక్స్, నగదు ప్రోత్సాహం అందించారు. దేవరకోట అగ్ని ప్రమాద బాధితునికి, ఐఐటీ టాపర్ విద్యార్థికి క్లబ్ సభ్యులు అన్నవరపు పాండురంగారావు ఆర్థిక సాయం చేశారు. మాజీ గవర్నర్ కంకణాల శ్రీనివాసరావు, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, వైపీసీ ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, పీఎన్ విజయబాబు, క్లబ్ పెద్దలు నర్రా సాయిబాబు, ముమ్మనేని రాజ కుమార్, వరదా హరిగోపాల్, కస్తూరి ప్రసాద్, కోసూరు శివాజీ, ఏఎల్ఆర్‌కే ప్రసాద్, తగిరిశ సాంబశివరావు, అడపా గురవయ్య, ఎస్‌జీఏ బాషా, ఎంవీ కృష్ణారావు, బి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎక్కువైన నీటిని సముద్రంలోకి వదులుతారు

- నీటి పారుదల శాఖా మంత్రిగా చేశావు ఆ మాత్రం తెలియదా?
- మాజీ మంత్రి దేవినేని ఉమాపై ఎమ్మెల్యే సింహాద్రి ఆగ్రహం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: సాగునీరు ఎక్కువైనా, అవసరం లేకపోయినా కాలువ నుంచి సముద్రంలోకి వదలడం పరిపాటని, ఈ విషయం కూడా తెలియకుండా విమర్శలు చేస్తున్న దేవినేని ఉమామహేశ్వరరావు నీటి పారుదల శాఖ మంత్రిగా ఎలా పనిచేశారో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. అవనిగడ్డలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల కోసం హత్యలు చేసే సంస్కృతికి తమది కాదని, విమర్శలు చేసేముందు తమ క్యారక్టర్ ఏమిటో దేవినేని ఉమామహేశ్వరరావు తెలుసుకోవాలని అన్నారు. రాజకీయాల కోసం హత్య చేసిన ప్రబుద్ధుడు ఇక్కడికొచ్చి బుద్ధులు చెప్పడమా అని ప్రశ్నించారు. జిల్లా నుంచి కులతత్వాన్ని రాష్ట్ర వ్యాప్తం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. గతంలో మట్టి, ఇసుక ట్రాక్టర్‌లను వదిలి పెట్టకుండా దందాలు వసూలు చేసిన బొండా ఉమామహేశ్వరరావు నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. తానే డాక్టర్ శ్రీహరి హత్యకేసుని సీబీసీఐడీ చేత విచారణ చేయించాలని డిమాండ్ చేశానని గుర్తుచేశారు. దోషులెవరో ఎంత త్వరగా తేలితే ప్రజలకు నిజాలు తెలుస్తాయని, గతంలో ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిన డీఎస్పీతో శ్రీహరి హత్యకేసును తేల్చకుండా వెళ్లిపోతున్నారని, వచ్చే డీఎస్పీ అయినా కేసుని ఛేదించాలని అడిగింది తానేనని ఎమ్మెల్యే సింహాద్రి గుర్తు చేశారు. గాంధేయవాదినని శాసన సభ మాజీ డెప్యూటీ స్పీకర్ బుద్ధప్రసాద్ గొప్పలు చెప్పుకుంటారని, హంతకులను పక్కన పెట్టుకుని తిరగడం గాంధేయ మార్గమా అని ప్రశ్నించారు. ఆయన గురించి చెప్పాలంటే చాలా ఉన్నాయని, ఆయన అల్లుడు బినామీగా చేపట్టిన అవనిగడ్డ–కోడూరు రోడ్డు వేసిన రెండు రోజులకే పోయిందని ఆ రోజుల్లో ధర్నాలు చేస్తే తమపై కేసులు కూడా పెట్టించారని చెప్పారు. అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు కట్టకుండా గోడలు కట్టించి కాంట్రాక్టర్‌తో ఇళ్లు కట్టించుకున్న దెవరో ప్రజలకు తెలుసన్నారు. ఇంటికి అక్రమంగా దొంగ ఇసుక తోలుకున్నదెవరో, కాంట్రాక్టర్‌తో లాలూచీ పడి రైతులను ఇబ్బందులు పెట్టిందెవరో ప్రజలకు తెలుసన్నారు. ఏవో నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని, ఈ సారి ఎన్నికల్లో మీకు ఈ ఓట్లు కూడా రాకుండా ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, జయగోపాల్ పాల్గొన్నారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

పెనమలూరు: పిల్లలకు చదువుతో పాటు ఉన్నత విలువలు నేర్పాలని అమరావతి బాలోత్సవ్ గౌరవ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు అన్నారు. యనమలకుదురు ఒకటో వార్డులో షేక్ రంగావలి భవన్, విశ్వమానవ సంక్షేమ సంఘం, అమరావతి బాలోత్సవ్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ట్యూషన్ సెంటర్ ప్రారంభించారు. ఇప్పటివరకు 28 ట్యూషన్ సెంటర్లు ప్రారంభించామన్నారు. పి.మస్తాన్‌రావు, పిన్నమనేని మురళీకృష్ణ, యూవీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని అమలేశ్వరి విద్యా నికేతన్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1998వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వీరంతా క్షేమ సమాచారం అడిగి తెలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రోజంతా ఆనందంగా గడిపారు.

విద్యార్థినులకు సన్మానం

చల్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థినులకు ఘన సన్మానం జరిగింది. ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన షేక్ జాస్మిన్, కొత్తమాజేరు జెడ్పీ హైస్కూల్‌లో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన తెనాలి జెస్సికాలను స్థానిక సాయినగర్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి విలువైన స్థలం వితరణ

- దాతృత్వం చాటిన కడవకొల్లు
- రూ.లక్షతో మట్టి మెరక పనులకు శ్రీకారం


మెరక పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడూరు: వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని మందపాకల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో అదే గ్రామంలోని ప్రైవేట్ సంస్థకు చెందిన భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై విద్యా శాఖ అధికారులు గతంలో ప్రభుత్వానికి నివేదించగా పాఠశాల భవనాల నిర్మాణాలకు ఆమోదం లభించింది. భవనాల నిర్మాణాలకు గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో నరసింహారావు తన సొంత స్థలాన్ని పాఠశాల భవనాల నిర్మాణానికి ఇవ్వడానికి ముందుకొచ్చారు. గ్రామంలో తనకున్న రూ.12 లక్షల విలువ చేసే 15 సెంట్ల భూమిని విద్యా శాఖకు అప్పగించారు. ఈ 15 సెంట్ల భూమిలో ప్రభుత్వం మంజూరు చేసిన భవనాలను నిర్మించాలని అధికారులకు సూచించారు. స్థలాన్ని వితరణగా ఇవ్వడంతో ఆ స్థలంలో మట్టి మెరక పనులను చేసేందుకు కూడా నరసింహారావు ముందుకొచ్చారు. రూ.లక్ష వ్యయంతో మట్టి మెరక పనులను ఆదివారం ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టి పెట్టికొని స్థలాన్ని ఇచ్చామని నరసింహారావు తెలిపారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సర్పంచి అద్దంకి శివప్రసాద్, వెన్నా ప్రసాద్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, ఎంపీటీసీ పరిశె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

200 మందికి వైద్యసేవలు

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. రోటరీ హాస్పిటల్, అను హాస్పిటల్స్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాల ఆవరణలో గొంతు, క్యాన్సర్, ఎముకలు, నరాలు, దంత వైద్య సేవలు అందించారు. 200 మందికి ఉచితంగా అన్ని పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసీజీ, ఎకో, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరిపించారు.

